సాక్షి ఒడిశా

శుక్రవారం । 15 । మార్చి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు


భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,35,232లు, బంగారం 5 గ్రాముల 600 మిల్లీ గ్రాములు, వెండి 5గ్రాముల 200 మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



కొనసాగుతున్న సస్పెన్స్..!

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అధికార బీజేడీ, విపక్ష బీజేపీల మధ్య పొత్తు ఎటూ తేలడం లేదు.

- 10లో



న్యూస్‌రీల్

ట్రాక్టర్ దొంగతనం చేసిన వ్యక్తి అరెస్టు



పోలీసులకు పట్టుబడిన ట్రాక్టర్ దొంగ

జయపురం: పట్టణంలోని గ్లోబెల్ ప్రైవేట్ హాస్పిటల్ సమీపంలో శనివారం రాత్రి ఒక ట్రాక్టర్ దొంగిలించబడింది. స్థానిక భాగ బండార్ సాహి రాజేంద్ర ఖోడ లికిత ఫిర్యాదుపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎట్టకేలకు బొయిపరిగుడ పోలీసుస్టేషన్ పరిధి జాని పుట్ గ్రామంలో బుధవారం ట్రాక్టర్‌ను కనుగొని జప్తు చేశారు. ట్రాక్టర్ దొంగించిన జయపురం సదర్ పోలీసుస్టేషన్ పరిధి బగ్రాగుడ గ్రామానికి చెందిన వ్యక్తి శుక్ర ఖిలో(38)ని అరెస్టు చేసినట్లు జయపురం పట్టణ పోలీసు అధికారి రమణీరంజన్ దొళాయ్ గురువారం తెలియజేశారు. అతడిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు వెల్లడించారు.

ఆరోగ్య బీమా పరిమితి పెంపు

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ ఆలయ సేవకులకు రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య బీమా పరిమితిని రూ.5 లక్షలకు పెంచింది. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సేవకుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రకటించారు. ఆరోగ్య బీమాను రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడంతో క్లిష్టమైన వ్యాధుల చికిత్స కోసం అదనంగా రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించారు.

ఉన్నత చదువులకు సాయం

నీట్, జేఈఈ, సివిల్ సర్వీసెస్‌తో సహా వృత్తి పరమైన కోర్సులకు ప్రవేశ పరీక్ష కోసం కోచింగ్ పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం సేవాయత్‌ల పిల్లలకు రూ.50,000 ఆర్థిక సహాయం అందజేస్తుంది. లబ్ధిదారులు సంవత్సరానికి 3 దఫాలుగా సహాయం పొందవచ్చు. పెంచిన బీమా సొమ్ము, కోచింగ్ ఫీజులు, సేవకులకు ఇతరత్రా సాయాన్ని చెల్లించేందుకు జగన్నాథ ఆలయ నిర్వాహకులకు ప్రభుత్వం రూ.10.85 కోట్లను మంజూరు చేసిందని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఇంతకుముందు అనేకసార్లు పూరీని సందర్శించి సేవాయత్‌లతో మాట్లాడిన 5టీ చైర్మన్ వి.కార్తికేయ పాండియన్ అందించిన సూచనల మేరకు ముఖ్యమంత్రి ఈ ప్రకటన చేశారు.

ముగిసిన శతావధానం



ఇప్పిలి రాజును సత్కరిస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక బాలాజీ నగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర కల్యాణ మండపంలో ఉత్కళాంధ్ర తెలుగు బ్రాహ్మణ సేవా సమాజం ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా కొనసాగిన శతావధానం బుధవారం రాత్రితో ముగిసింది. శతావధాని డాక్టర్ బులుసు అపర్ణ, సంచాలకులు బంకుపల్లి రమేష్ శర్మలతో కొనసాగిన ఈ శతావధానం ఆద్యాంతం రసవత్తరంగా ముగిసింది. సాహితీ అభిమానులు, కళాభిమానులు ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రప్రథమంగా రాష్ట్రంలోనే ఇటువంటి తరహా శతవధానం కార్యక్రమాన్ని బ్రాహ్మణ సేవా సమాజం నిర్వహించడంపై పలువురు అభినందనలను తెలిపారు. మూడు రోజులు పాటు ప్రాశ్నికులు అడిగిన ప్రశ్నలకు 75 పద్యాలను అనర్గళంగా, రాగయుక్తంగా ధారణ చేసి ప్రశంసలు అందుకున్నారు. డాక్టర్ అపర్ణ, బంకుపల్లి రమేష్ శర్మలతో కార్యక్రమంలో పాల్గొన్న ప్రాశ్నికులు, అతిథులు, సంస్థ అధ్యక్షులు రేజేటి శ్రీనివాస్ శర్మ, కార్యదర్శి భళ్లమూడి నాగరాజులు శతావధానులను సన్మానించారు. ఇదిలా ఉండగా కళాభిమానులు, సాహితీ ప్రియులైన శ్రీపాద వీరభద్రరావు, ముట్నూరు శ్రీనివాస్, కొల్లూరు సుబ్రహ్మణ్యం, ఏవీఎస్ గిరి, కల్యాణ వేంకటేశ్వర ఆలయ ధర్మకర్త మండలి అధ్యక్షుడు చంద్రమౌళి కుముంధాన్, కార్యదర్శి రాఘవ కుముంధాన్, మజ్జిగౌరి ఆలయ ట్రస్ట్ సభ్యులు ఇప్పిలి సన్యాసిరాజులను బ్రహ్మణ సేవా సమాజం జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలతో సత్కరించింది.

ఆదర్శ పంచాయతీ.. అభివృద్ధి అధోగతి..!



జంబు గ్రామం

- హలువలోని జంబులో సమస్యల కొలువు
- రెండు నెలలుగా దాహం కేకలు
- అధ్వాన రహదారితో ఇబ్బందులు

రాయగడ: రాష్ట్రస్థాయిలో ఉత్తమ పంచాయతీగా గుర్తింపు పొందిన హలువా పరిధిలో ఉన్నటువంటి జంబు గ్రామంలో సమస్యలు తిష్టవేశాయి. ఈ గ్రామంలో 100 మందికి పైగా జనాభాతో 35 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఆరేళ్ల క్రితం వరకు వీరంతా కొండ ప్రాంతంలోని ఉపారొజంబులో నివసిస్తుండేవారు. అయితే ప్రభుత్వ సూచనలు మేరకు ప్రస్తుతం జంబు గ్రామంలో స్థిరపడ్డారు. హలువ పంచాయతీ పరిధిలో ఉన్నటువంటి ఈ గ్రామంలో గత రెండు నెలలుగా దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఉన్న రెండు గొట్టపు బావుల్లో ఒకటి మాత్రమే ప్రస్తుతం పనిచేస్తోంది. అదికూడా గంటల తరబడి కొడితే ఒక్కబిందే నిండడమే కష్టతరమవుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. గతేడాది గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు వసుధ పథకంలో భాగంగా తాగునీటి ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేపట్టారు. దీనిలో భాగంగా ప్రతీ ఇంటి ముందు కుళాయిలను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఆ పనులు నిలిచిపోయాయి. దీంతో తమ గ్రామంలో తాగునీటి సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఆశించినవారికి నిరాశే మిగిలింది.



వసుధ పథకంలో నిర్మించిన ట్యాంక్



రాళ్లుతేలిన రహదారి

అధ్వానంగా రహదారి

మెయిన్ రోడ్డు నుంచి జంబు గ్రామానికి సుమారు 3 కిలో మీటర్ల దూరం ఉంటుంది. ఎప్పుడో వేసిన రోడ్డు కావడంతో రాళ్లుతేరి నరకయాతన చవిచూడాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. ఆదర్శ పంచాయతీలో గ్రామాల పరిస్థితే ఇలా ఉంటే మారుమూల ప్రాంతాల్లో ఉన్న గ్రామాల పరిస్థితి ఇంకెలా ఉంటుందోనన్న ప్రశ్న తలెత్తుతోంది.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



గ్రామంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. అసలే వేసవి కాలం కావడంతో సమస్య మరింత జఠిలమవుతోంది. వందమందికి పైగా నివసిస్తున్న మేమంతా ప్రతిరోజూ తాగునీటి కోసం ఆరాటపడడం పరిపాటిగా మారింది. చేపట్టిన తాగునీటి ప్రాజెక్టు పనులు పూర్తయితే సమస్య పరిష్కారమవుతుంది.

– సొరొ మండంగి, గ్రామస్తుడు

గ్రామంపై చిన్నచూపేలా



ఒకప్పుడు అడవుల్లో నివసించేవాళ్లం. అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తానంటే ఇక్కడకు వచ్చి స్థిరపడ్డాం. గ్రామానికి సరైన రహదారి లేదు. మరోవైపు తాగునీటి సమస్య వేధిస్తోంది. యువతకు ఉపాధి అవకాశాలు లేవు. ప్రభుత్వం చొరవ తీసుకుని గ్రామాన్ని అభివృద్ధి చేయాలి. కొంతమందికి వృద్ధాప్య పింఛన్లు కూడా అందడం లేదు.

– రుగ్గు హిమిరిక, గ్రామస్తుడు

సమస్యలు పరిష్కరిస్తున్నాం



హలువ పంచాయతీలోని 17 గ్రామాల్లో ఉన్నటువంటి సమస్యలు ఒకొక్కటీ పరిష్కారమవుతున్నాయి. కొత్తగా పంచాయతీ కార్యాలయం ఏర్పాటు చేశాం. హలువ సమీపంలో ప్రయాణికుల సౌకర్యార్థం విశ్రాంతి భవనం నిర్మించాం. జంబు గ్రామంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. మరో రెండు, మూడు నెలల్లో వసుధ ప్రాజెక్టు పనులు పూర్తవుతాయి. తాగునీటి సమస్య పూర్తిగా తొలగిపోతుంది. అదేవిధంగా రహదారి పనులు కూడా చేపడతాం.

– తమ్మారావు బిడిక, సర్పంచ్, హలువా పంచాయతీ

ఉపాధ్యాయురాలి మెడలో గొలుసు చోరీ



బాధితురాలు రష్మిత కుమారి హోత

రాయగడ: ఒక ఉపాధ్యాయురాలి మెడలో బంగారు గొలుసు, మంగళ సూత్రాన్ని గుర్తు తెలియని ఇద్దరు దుండగులు దొంగలించిన సంఘటన శిఖాల్ పోలీసుస్టేషన్ పరిధి పితామహల్ మలుపు వద్ద బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. శిఖాల్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న రస్మిత కుమారి హోత బుధవారం సాయంత్రం తన భర్త దేవేశ్‌తో కలిసి స్కూటీపై పాఠశాల నుంచి ఇంటికి వెళ్తోంది. ఈ క్రమంలో పితామహల్ మలుపు వద్ద హెల్మెట్లు ధరించిన ఇద్దరు దుండగులు వేరే బైక్ మీద వచ్చి దంపతులను అడ్డగించారు. వారిని భయపెట్టి కుమారి మెడలో బంగారు గొలుసు, మంగళ సూత్రాన్ని లాక్కొని వెళ్లిపోయారు. ఈ విషయమై శిఖాల్ పోలీసు స్టేషన్‌లో కుమారి ఫిర్యాదు చేసింది. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు. మెడలో బంగారు ఆభరణాలు తెంచుకెళ్తే సమయంలో మెడపై గాయాలవ్వడంతో చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా కొద్ది రోజుల క్రితం పొరుగు మన్యం జిల్లా పార్వతీపురం కొమరాడ ప్రాంతానికి చెందిన ఇద్దరు దంపతులు రాయగడలో జరిగిన ఒక విందుకు హాజరై, తిరిగి బైకుపై ఇంటికి వెళ్తున్న సమయంలో దుండగులు వారిని అడ్డగించి బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. అదేవిధంగా ఏడాదిన్నర క్రితం కంచికవలస కూడలిలో ఆంధ్రకు చెందిన ఒక బంగారు వ్యాపారిని అడ్డగించి, అతని వద్దనున్న బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. తరచూ ఇటువంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నప్పటికీ పోలీసు యంత్రాంగం తగు చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాగా రాయగడ నుంచి సరిహద్దు ప్రాంతం కెరడ వరకు బైకుపై ప్రయాణం చేయాలంటే గుబులు పుడుతోందని ప్రజలు వాపోతున్నారు.

టేకు దుంగల అక్రమ రవాణా



అరెస్టైన నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

రాయగడ: ద్విచక్ర వాహనంపై టేకు దుంగలను అక్రమంగా రవాణా చేస్తున్న ఒక నిందితుడిని అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. దీనికి సంబంధించి నిందితుడి నుంచి విలువైన మూడు టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. రవాణాకు వినియోగించే ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టుకు తరలించారు. మహేంద్రగిరి రేంజ్ అధికారి అమిత్ సబ్రజిత్ ఇతర సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు.

దివ్యాంగ కళాకారుడికి కీబోర్డు అందజేత



కీబోర్డును సాబొరొకు అందిస్తున్న అధికారులు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ సమితి ఖిల్లాపాదొరొ గ్రామానికి చెందిన దివ్యాంగుడైన లక్ష్మణ సాబరొ అనే కళాకారుడికి జిల్లా సామాజిక సురక్ష శాఖ సుమారు రూ.28 వేలు విలువజేసే కీబోర్డు (వాయిద్య) పరికరాన్ని వితరణగా చేసింది. ఆ శాఖ జిల్లా అధికారి సింహాచల్ మహాపాత్రో, జిల్లా దివ్యాంగుల మహా సంఘం అధ్యక్షుడు అమరేంద్ర నాథ్‌లు ఈ పరికరాన్ని గురువారం ఆ శాఖ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా కళాకారుడు సాబొరొ మాట్లాడుతూ కొద్ది నెలల క్రితం రాజధానిలో జరిగిన ఒక మెలోడీ కార్యక్రమంలో పాల్గొన్నట్లు వెల్లడించారు. అక్కడ తాను పాడిన పాటను గవర్నర్ రఘుబర్ దాస్ ప్రశంసించారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమం అనంతరం గవర్నర్‌ను కలవడంతో ఆయన ఏం కావాలని అడడగా కీబోర్డు ఇప్పించాలని కోరినట్లు తెలియజేశారు. దీంతో ఆయన స్పందించి ఈ కానుకను జిల్లా సామాజిక సురక్షా శాఖ ద్వారా అందించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

భారీగా గంజాయి స్వాధీనం



రాయగడ: గంజాయితో పట్టుబడిన నిందితులు



బరంపురం: పట్టుబడిన గంజాయి, ద్విచక్ర వాహనాలు

బరంపురం: కొందమాల్, గజపతి, గంజాం జిల్లాల సరిహద్దుల్లో గంజాయి మాఫియా ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. తాజాగా కొందమాల్–గంజాం జిల్లా సరిహద్దు పిరింగియా పోలీసుస్టేషన్ పరిధి కళింగా ఘాట్ రోడ్డు నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలపై అక్రమంగా తరలిస్తున్న 152 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. అయితే పోలీసుల వస్తున్నట్లు ముందే గమనించిన నిందితులు వాహనాలు, గంజాయిని వదిలి పరారయ్యారు.

రాయగడ: స్థానిక రైల్వేస్టేషన్‌లో గంజాయితో నలుగురు మహిళలను రైల్వే పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 70 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిలో ఇద్దరు మహిళలు బీహార్‌కు చెందినవారు కాగా, మరొకరు పంజాబ్, ఇంకొకరు ఢిల్లీకి చెందిన మహిళగా పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. బుధవారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి రైల్వే పోలీసు ఎస్ఐ ఎస్‌కే బారిక్ తెలిపిన వివరాల మేరకు.. సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్‌లో నిందితులు గంజాయి అక్రమ రవాణా చేయనున్నట్లు అందిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు తనిఖీలు నిర్వహించారు. నలుగురు యువతులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారి బ్యాగులు తనిఖీ చేశారు. దీంతో బ్యాగుల్లో గంజాయి బయటపడింది. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఎస్‌అండ్‌టీ సిబ్బంది

భువనేశ్వర్:

తూర్పు కోస్తా రైల్వే ఖుర్దారోడ్ మండలంలో సిగ్నల్ అండ్ టెలికాం విభాగం సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి గురువారం నిరసన ప్రదర్శించారు. సిబ్బంది వ్యతిరేక కార్యకలాపాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఈ ఆందోళన చేపట్టాలని అఖిల భారత రైల్వే సిగ్నల్ అండ్ టెలికాం సిబ్బంది సంఘం పిలుపునిచ్చింది. అపరిమిత పనివేళలతో ఈ విభాగం సిబ్బంది అవాంఛనీయ ఇబ్బందులకు గురై సతమతమవుతున్నారని ఆరోపించారు. 8 గంటల పరిమిత పనివేళల రైల్వే బోర్డు నిబంధనలకు అధికార యంత్రాంగం నీళ్లొదిలి సిబ్బందిని వేధిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రింబవళ్లు ఈ విభాగం సేవలు అనివార్యం. ఈ నేపథ్యంలో నిత్యం 3 విడతల్లో సిబ్బందికి క్రమ పద్ధతిలో నియమించాల్సి ఉందని గుర్తు చేశారు. ఈ మేరకు 2005 సంవత్సరంలో రైల్వే బోర్డు ఆదేశాలు జారీ చేసింది. విపత్కర పరిస్థితుల్లో విధుల నిర్వహణ పురస్కరించుకుని విపత్తు భత్యం (రిస్క్ అలవెన్సు) మంజూరు, బహనాగా బజార్ రైల్వే స్టేషను దుర్ఘటనలో నిర్దోషులైన సిగ్నల్ అండ్ టెలికాం ఉద్యోగుల్ని తక్షణమే జైలు నుంచి విడుదల తదితర డిమాండ్లతో నల్ల బ్యాడ్జీలు ధరించి గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిరవధికంగా నిరసన ప్రదర్శించారు.

ప్రజ్ఞా సామల్‌కు సీజేఐ సత్కారం



భారత రాజ్యాంగం ప్రతులతో ప్రజ్ఞా సామల్‌కు సీజేఐ సత్కారం



సీజేఐ సత్కారం పొందిన ప్రజ్ఞా సామల్ తల్లిదండ్రులు

భువనేశ్వర్: సామాన్య కుటుంబంలో జన్మించి న్యాయశాస్త్రంలో లోతైన పరిశోధనకు ప్రపంచ దేశాల విశ్వవిద్యాలయాల నుంచి పిలుపునందుకున్న 26 ఏళ్ల ప్రజ్ఞా సామల్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి డి.వై చంద్రచూడ్ అభినందించారు. ఆమె 6 పాశ్చాత్య విశ్వవిద్యాలయాల్లో న్యాయశాస్త్రంలో మాస్టర్స్ చదివేందుకు స్కాలర్‌షిప్ సాధించడం విశేషం. 2 యూఎస్ విశ్వ విద్యాలయాల నుంచి స్కాలర్‌షిప్‌తో పిలుపునందుకుంది. ప్రజ్ఞా సుప్రీంకోర్టులో వంట మనిషి కుమార్తె. న్యాయ పరిశోధన రంగంలో ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల నుంచి పిలుపు అందుకున్న ప్రజ్ఞను భారత ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్, ఇతర సుప్రీం కోర్టు న్యాయమూర్తులు ప్రత్యేకంగా సత్కరించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులందరూ సంతకం చేసిన భారత రాజ్యాంగ ప్రతిని ప్రధాన న్యాయమూర్తి ప్రజ్ఞకు బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులను కూడా సన్మానించారు.

జాజ్‌పూర్ జిల్లా నుంచి...

జాజ్‌పూర్ జిల్లాకు చెందిన అజయ్ కుమార్ సామల్ దంపతుల కుమార్తె ప్రజ్ఞా సామల్. కొలంబియా లా స్కూల్, చికాగో లా స్కూల్, న్యూయార్క్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా కేరీ లా స్కూల్, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా బర్కిలీ స్కూల్ ఆఫ్ లా మరియు యూనివర్సిటీ ఆఫ్ మిచిగాన్ లా స్కూల్ వంటి 6 పాశ్చాత్య విశ్వవిద్యాలయాల నుంచి ప్రజ్ఞా సామల్ (26) ఎల్ఎల్ఎమ్ ప్రోగ్రామ్‌లకు అడ్మిషన్ ఆహ్వానం అందుకుంది. అంతేకాకుండా ఆమె బర్కిలీ, మిచిగాన్ న్యాయ పాఠశాలల నుంచి స్కాలర్‌షిప్‌లను పొందింది. 2021లో అమిటీ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత సాధించింది. తర్వాత సుప్రీంకోర్టు న్యాయమూర్తి వద్ద జ్యుడీషియల్ క్లర్క్‌గా పనిచేసింది. ఆయన ఉద్యోగ విరామం పొందడంతో గతేడాది ఫిబ్రవరి నెలలో సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ ప్లానింగ్ (సీఆర్‌పీ)లో చేరింది. తన విజయానికి తండ్రే కారణమని ఆమె పేర్కొంది. 1996లో ఆమె తండ్రి సుప్రీంకోర్టులో చేరారు. నేను అతని బిడ్డను కావడం గర్వకారణమని ప్రధాన న్యాయమూర్తి సత్కారం అందుకున్న సందర్భంగా ప్రజ్ఞా సగర్వంగా ప్రకటించింది. ఆయన శక్తికి తగినంతలో ప్రతి అడుగులో తనకు సహాయ సహకారాలు అందజేసి ప్రేరణగా నిలిచారని తెలిపింది.

క్లుప్తంగా

17న సెపక్‌తక్ర జట్టు ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: కర్నూలులోని రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఆల్ ఇండియా సపక్ తక్రా పోటీలు ఈ నెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు అంతర వర్సిటీ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ గురువారం వర్సిటీలో నిర్వహించారు. ఐదుగురు క్రీడాకారులను ప్రతిభ ఆధారంగా ఎంపిక చేశారు. వి.ప్రవీణ్ (తొగరాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల), జి.లక్ష్మణ్ కుమార్ (కాకినాడ ఆదిత్య శ్రీకాకుళం), బి.నిఖిల్‌దేవ్ (శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల), షణ్ముఖ యోగేష్ (కాకినాడ ఆదిత్య), కె.నిఖిత్‌కుమార్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల నరసన్నపేట) పాల్గొన్నారు. కోచ్‌గా జి.అర్జున్ రెడ్డి వ్యవహరిస్తారు. ఎంపికైన క్రీడాకారులను స్పోర్ట్స్ డీన్ యు.కావ్య జ్యోత్స్న, ఫిజికల్ డైరెక్టర్లు శ్రీనివాస్, భాస్కర్ అభినందించారు.

కిడ్నీ కౌన్సిలింగ్ సెంటర్ ప్రారంభం

కాశీబుగ్గ: ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా గురువారం పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో కిడ్నీ పేషెంట్ కౌన్సిలింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ రిబ్బన్ కత్తిరించి సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిడ్నీ పరిశోధన కేంద్రానికి వచ్చిన వారు ఈ కేంద్రంలో రక్తనమూనాలు అందిస్తే వారు పరిశోధన విభాగానికి పంపిస్తారని అన్నారు. ఇప్పటికే కిడ్నీ వ్యాధికి గురైనవారికి ఆహారపు అలవాట్లు, పూర్తి డైట్ గురించి వివరిస్తారని, ఎలాంటి సలహాలు సూచనలు కావాల్సి ఉన్నా ఈ కేంద్రంలో లభిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ మోహన్ బాబు, నెఫ్రాలజీ డాక్టర్ రాకేష్, డాక్టర్ గుమ్మడి బాలాజీ, డాక్టర్ దిలీప్, ల్యాబ్ టెక్నీషియన్ కర్రి తిరుపతి, ఎంపీ సత్యంనారాయణ, 11 మంది రూరల్ సర్వే స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

యువత కోసం ఎక్స్‌ట్రీమ్ 125 ఆర్



కొత్తబైక్ తాళాన్ని కొనుగోలుదారునికి అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): టూ వీలర్స్‌లో యూత్ కోసం హీరో మోటో కార్ప్ హీరో ఎక్స్‌ట్రీమ్-125ఆర్ పేరిట సరికొత్త బైక్‌ను మార్కెట్‌లోకి తీసుకురావడం అభినందనీయమని యూట్యూబర్ అరవింద్‌సింగ్ అన్నారు. ఈ మేరకు గురువారం సాయంత్రం శ్రీకాకుళం నగరంలో వరం ఆటో సెంటర్ ఎండీ అంధవరపు ప్రసాద్ ఆధ్వర్యంలో బైక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలి ముగ్గురు కొనుగోలుదారులకు బైక్ తాళాలను అతిథుల చేతుల మీదగా అందజేశారు. వరం ఆటో సెంటర్ అధినేత అంధవరపు ప్రసాదరావు మాట్లాడుతూ ఆయిల్‌ట్యాంక్ ట్యాంక్ డిజైన్ చూపరులని ఆకట్టుకునేలా ఉందని స్ప్లిట్ స్టైల్ సీట్స్, స్ప్లిట్ గ్రాబ్ రెయిల్స్ వంటివి వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వరం ఆటో సెంటర్ జనరల్ మేనేజర్ ఎం.వెంకటరావు, మెకానిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోటిపల్లి మోహన్‌రావు, డిఎస్ఎమ్ గుణాకర్, మేనేజర్ రాజశేఖర్, సత్యం, పలువురు మెకానిక్ సోదరులు, కస్టమర్లు, వరం ఆటో సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ అదనపు ఎస్పీ బాధ్యతల స్వీకరణ



ఎస్పీ రాధికకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్ఈబీ అదనపు ఎస్పీ గంగాధర్

శ్రీకాకుళం క్రైమ్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ డి.గంగాధర్ గురువారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ జీఆర్ రాధికను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇసుక ర్యాంపుల పరిశీలన



వంశధార నది అంగూరు వద్ద ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న జాతీయ హరిత ట్రిబ్యునల్ బృందం

కొత్తూరు: మండలంలోని నివగాం గ్రామం వంశధార నదిలోని మాతల-నివగాం బ్రిడ్జి వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేసినట్లు గత ఏడాది ఆగస్టులో జాతీయ హరిత బృందానికి ఫిర్యా దు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు జాతీయ హరిత బృందం సభ్యురాలు సౌమ్య ఆధ్వర్యంలో నివగాం, అంగూరు గ్రామాల వద్ద ఇసుక ర్యాంపులను గురువారం పరిశీలించారు. నివగాం వద్ద గోతులు వరదలకు పూడ్చుకు పోయాయి. అంగూరు వద్ద ప్రస్తుతం ఇసుక తవ్వకాలను పరిశీలించారు. నివేదికలను ప్రభుత్వంతో పాటు ఫిర్యాదు దా రులకు అందిస్తామని ట్రిబ్యునల్ సభ్యులు తెలిపారు. బృందంతోపాటు బీఆర్వో గణపతి, పొల్యూ షన్ బోర్డు ఈఈ రామారావు నాయుడు, ఇరిగేషన్ ఏఈ ప్రసాదరావు, డీటీ సత్యనారాయణ ఉన్నారు.

కొనసాగుతున్న సస్పెన్స్..!

- ఎటూ తేలని బీజేడీ, బీజేపీ పొత్తు వ్యవహారం
- పెదవి కదపని ఇరుపార్టీల నేతలు
- మరలా ఢిల్లీకి పయనమైన సామల్

భువనేశ్వర్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అధికార బీజేడీ, విపక్ష బీజేపీల మధ్య పొత్తు ఎటూ తేలడం లేదు. రెండు పార్టీల రహస్య సమావేశాలు, కేంద్ర నాయకుల మంతనాలు, సంప్రదింపులు, సమావేశాల ఆంతర్యం స్పష్టమవ్వడం లేదు. ఈ వ్యవహారాల్లో పాలుపంచుకున్న అధికార ప్రతినిధులు పెదవి కదపకపోవడంతో సస్పెన్స్ కొనసాగుతోంది. గురువారం మధ్యాహ్నం వరకు పొత్తుపై ఘంటాపథంగా ప్రకటనలు జారీ చేసిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ అకస్మాతుగా వైఖరి మార్చారు. మరోవైపు ఢిల్లీ నుంచి పిలుపు రావడంతో హుటాహుటిన బయల్దేరారు. ఆదివారం నుంచి ఢిల్లీలో మకాం వేసిన మన్మోహన్ సామల్ గురువారం ఉదయం రాష్ట్రానికి తిరిగి వచ్చారు. రాష్ట్రంలో బిజూ జనతా దళ్‌తో పొత్తు ప్రసక్తే లేదు. ఒంటరిగా పోటీచేసి రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ఆయన బాహాటంగా ప్రకటించారు. లోగడ పలుమార్లు ఇదే వైఖరిని బహిరంగంగా ప్రకటించారు. అయితే గురువారం మధ్యాహ్నం నాటికి వైఖరి మార్చి తన వ్యాఖ్యలను మీడియా వక్రీకరించి దుమారం రేపుతోందని సర్దిచెప్పుకున్నారు. బీజేడీతో పొత్తు వ్యవహారంలో పార్టీ అధిష్టానానిదే తుది నిర్ణయమని ప్రకటించారు. ఇంతలో ఢిల్లీకి రమ్మని పిలుపు రావడంతో మరోసారి పయనమయ్యారు.

సీఎం నవీన్ అధ్యక్షతన సమావేశం

పలువురు తెలుపుతున్న సమాచారం ప్రకారం ముఖ్యమంత్రి అధికారిక నివాస భవనంలో గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన బిజూ జనతా దళ్ నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం అధికార ప్రతినిథులు పెదవి కదపకుండా మీడియాను దాటవేసే ప్రయత్నం చేశారు. సార్వత్రిక ఎన్నికల సన్నద్ధత పురస్కరించుకుని జిల్లా పర్యవేక్షకులతో పార్టీ అధ్యక్షుడు ముఖాముఖి సమావేశమయ్యారని బీజేడీ ఉపాధ్యక్షుడు దేవీ ప్రసాద్ మిశ్రా తెలిపారు. లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో ప్రాంతాలవారీగా సన్నద్ధత, వ్యూహం వంటి అంశాలను చర్చించినట్లు పేర్కొన్నారు. బీజేపీతో పొత్తు విషయంలో పెదవి కదిపేందుకు ఆయన నిరాకరించారు. ఈ విషయంలో బీజేడీ జాతీయ అధికార ప్రతినిధి సంతృప్త మిశ్రా మాట్లాడుతూ బీజేపీతో పొత్తు విషయమై దళపతి నవీన్ పట్నాయక్ సకాలంలో సముచిత ప్రకటన జారీ చేస్తారని చాకచక్యంగా దాటవేశారు. బీజేడీ, బీజేపీ కూటమి వార్తలు వచ్చిన తర్వాత బీజేడీ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించడం వరుసగా ఇది రెండోసారి. అయితే తొలిసారి సమావేశం తర్వాత రాష్ట్ర స్వార్థ ప్రయోజనాల కోసం బీజేపీతో పొత్తుకు సిద్ధం అన్నట్లు ప్రకటించారు. తాజా సమావేశం తర్వాత అటువంటి ప్రకటన ఏమీ లేకపోవడం పలు సందేహాలకు తావిస్తోంది. సమావేశానికి ముందు బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ వ్యాఖ్యల తర్వాత తలెత్తిన పరిణామాల దృష్ట్యా బీజేడీ వర్గాలు పెదవి కదపకుండా జాగ్రత్త పడినట్లు తెలుస్తుంది.

సోషల్ మీడియా పోస్టు తొలగింపు

ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ తన సోషల్ మీడియా ఖాతాలో ఒడిశాలో కోట్లాది మంది జనుల ఆశీర్వాదంతో రాష్ట్రంలో బీజేపీ ఒంటరిగా పోటీ చేస్తుందని పోస్టు పెట్టారు. రాష్ట్ర ప్రయోజనాలు, స్వాభిమానం కోసం ఈ ఎన్నికల్లో పోటీ చేసి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో రాష్ట్రంలో బీజేడీతో పొత్తు లేనట్లేనని దుమారం రేగింది. కాసేపట్లో ఈ దుమారం మన్మోహన్ సామల్ వైఖరిని తలకిందులు చేసింది. దీంతో తక్షణమే సోషల్ మీడియా వేదిక నుంచి తన పోస్టును ఆయన తొలగించారు.

బహుళ ప్రయోజన స్టేడియం ప్రారంభం



ఛత్రపూర్ పోలీసుస్టేషన్



వర్చువల్ విధానంలో పాల్గొన్న సీఎం నవీన్ పట్నాయక్

బరంపురం: గంజాం జిల్లాలోని గోపాల్‌పూర్‌లో బహుళ ప్రయోజన స్టేడియాన్ని సీఎం నవీన్ పట్నాయక్ వర్చువల్ విధానంలో బుధవారం ప్రారంభించారు. అలాగే హింజిలికాట్, గోపాల్‌పూర్, ఛత్రపూర్‌లలో కొత్త పోలీసుస్టేషన్ భవనాలను ప్రారంభించారు. కార్యక్రమాల్లో బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ పండా, కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా, ఎస్పీ సార్వాణ్ వివేక్, నగర మేయర్ సంఘమిత్ర దొళాయి, డిప్యూటీ మేయర్ వివేక్ రెడ్డి, గంజాం జిల్లా బీజేడీ అధ్యక్షుడు డా.రమేష్ చంద్రచావ్ పట్నాయక్, నగర కమిషనర్ భవానీ శంకర్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

'పొత్తు కుదిరితే కాంగ్రెస్‌దే విజయం'

భువనేశ్వర్: రాష్ట్రంలో అధికార బీజేడీ, విపక్ష బీజేపీ మధ్య పొత్తు కుదిరితే కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, జట్నీ నియోజకవర్గం ఎమ్మెల్యే సురేష్ కుమార్ రౌత్రాయ్ గట్టి ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. బీజేడీ, బీజేపీ పొత్తు తమకు పూర్తిస్థాయిలో లాభిస్తుందన్నారు. కూటమి కుదిరితే కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో 147 నియోజకవర్గాల్లో కనీసం 100 స్థానాలు, 21 లోక్‌సభ స్థానాల్లో 14 స్థానాల్లో గెలిపొందడం సాధ్యమన్నారు. ఈ రెండు పార్టీల ఉమ్మడి అవినీతి, అక్రమాలతో రాష్ట్రం కుదేలైపోయిందని ఆరోపించారు. వయో భారంతో తాను ఈసారి పోటీ చేయడం లేదని ప్రకటించారు. ఇక నుంచి తన ఇద్దరు కుమారులు ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొంటారని తెలిపారు. వీరిలో ఒకరు జట్నీ నియోజకవర్గం, మరొకరు నిమ్మాపడా నియోజకవర్గం నుంచి రాష్ట్ర శాసనసభకు పోటీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఖుర్దా జిల్లా 5 శాసనసభ స్థానాల్లో అతి తక్కువగా 3 స్థానాల్లో కాంగ్రెసు విజయం సాధిస్తుందన్నారు. ఈ మేరకు సన్నాహాలు భారీ స్థాయిలో కొనసాగుతున్నాయని వివరించారు.

'ఎన్నికలు బహిష్కరిస్తాం'



ఆందోళన చేపడుతున్న డొంబ్ సమాజం ప్రతనిధులు

రాయగడ: తమ న్యాయమైన 15 డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించకపోతే త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను బహిష్కరిస్తామని జిల్లా డొంబ్ సమాజం హెచ్చరించింది. ఈ మేరకు స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట గురువారం నిరవధిక ఆందోళన చేపట్టింది. సమాజం అధ్యక్షుడు ధానిరాం నాయక్, సాధారణ కార్యదర్శి జనార్ధన్ గొమరాడియాల నేతృత్వంలో సభ్యులంతా ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దానిరాం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని డొంబ్ తెగకు చెందిన వారికి ప్రభుత్వం ఎటువంటి సౌకర్యాలు కల్పించడంలేదని ఆరోపించారు. విద్యాలయాల్లో ఎస్సీ విద్యార్థులకు కేవలం 10 శాతం సీట్ల రిజర్వేషన్లు కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతం కంటే ప్రస్తుతం రాష్ట్రంలో ఎస్సీ జనాభా వృద్ధి చెందుతున్నా, అందుకు అనుగుణంగా మెరుగైన సౌకర్యాలు ప్రభుత్వం కల్పించడం లేదన్నారు. రాష్ట్రంలోని ప్రతీ ఎస్సీ, ఎస్టీ ఆశ్రమ పాఠశాలల్లో ఎస్సీ విద్యార్థులకు ప్రత్యేకంగా సీట్ల కేటాయింపుతో పాటు తగిన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతీ సమితి పరిధిలో 500 పడకల ఆశ్రమ పాఠశాలను ఎస్సీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. ఇదే విషయమై పలుమార్లు సంబంధిత శాఖ మంత్రులకు సమస్యలను విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేయడంతో పాటు ఎలక్షన్లు బహిష్కరిస్తామని స్పష్టం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా ఫ్లాగ్ మార్చ్



బరంపురం: నిమ్మఖండి పోలీసుస్టేషన్ పరిధి ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్

బరంపురం: సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకొని నగరంలో గురువారం కూడా పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అదేవిధంగా నగర ఫస్ట్‌గేట్ ప్రాంతంలో అర్ధరాత్రి వరకు వాహన తనిఖీలు విస్తృతంగా నిర్వహించారు. అనుమానం ఉన్నటువంటి వాహనాలను పెద్ద బజార్ పోలీసుస్టేషన్‌కి తరలిస్తున్నారు. అదేవిధంగా వారెంట్ ఉన్నవారిని అరెస్టు చేసి జైలుకి పింపిస్తున్నారు.

కొరాపుట్: జిల్లాలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. మాచ్‌ఖండ్, జొలాపుట్, రామగిరి, బోయిపరిగుడ ప్రాంతాల్లో గతంలో మావోయిస్టు పార్టీ కదలికలు ఎక్కువగా ఉండేవి. దీంతో ఆయా ప్రాంతాల్లో బీఎస్ఎఫ్ దళాలు క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలతో మమేకమయ్యాయి. క్రమేపీ గత పదేళ్లలో దళాల కదలికలు తగ్గాయి. అయినప్పటికీ కేంద్ర బలగాల కూంబింగ్ కొనసాగుతోంది. సార్వత్రిక ఎన్నికల్లో మరలా మావోయిస్టులు తమ ఉనికి చాటుకునే అవకాశం ఉందని సమాచారం వస్తోంది. దీంతో బలగాలు విస్తృతంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

జయపురం: మావో ప్రభావిత బొయిపరిగుడ సమితిలో ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బొయిపరిగుడ పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రజలు ఎటువంటి భయం లేకుండా నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఒత్తిళ్లు, డబ్బులకు లొంగకుండా సొంత అభిప్రాయంతో ఓటు వేయాలని సూచించారు. ఎవరైనా ఒత్తిడి చేస్తే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు అధికారి దీపాంజలి ప్రధాన్, 180 బీఎస్ఎఫ్ బెటాలియన్ కమాండెంట్ సంజయ దాస్ తదితరులు పాల్గొన్నారు.



కొరాపుట్: మావో ప్రభావిత ప్రాంతాల్లో బలగాల ఫ్లాగ్ మార్చ్



జయపురం: ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పోలీసులు, జవాన్లు

ఏసీబీలో వలలో సాబకోట ఇంజినీరింగ్ అసిస్టెంట్



రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన సాబకోట ఇంజనీరింగ్ అసిస్టెంట్ సవర లోకనాథం

మందస: మండలంలోని గిరిజన ప్రాంతమైన సాబకోట సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ సవర లోకనాథం యాంటీ కరప్షన్ బ్యూరో అధికారులకు గురువారం పట్టుబడ్డాడు. జగనన్న కాలనీ బిల్లులకు సంబంధించి ఓ గిరిజనుడి నుంచి రూ.5వేలు లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సాబకోట పంచాయతీ సింగుపురం గ్రామానికి చెందిన గిరిజనుడు నిమ్మన పరశురాంనకు జగనన్న కాలనీ ఇళ్లు మంజూరైంది. ఇంటి నిర్మాణం చేస్తున్న పరశురాం బిల్లు పెట్టాలని కోరగా, ఉద్యోగి లంచం అడిగాడు. దీంతో లబ్ధిదారుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, సీఐలు రమణమూర్తి, సీఐలు ఈశ్వరరావు, రమణల ఆధ్వర్యంలో పక్కాగా ప్లాన్ చేసి ఉద్యోగి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. లోకనాథం ఇదే మండలంలోని చీపి పంచాయతీ లొడకపెట్ట గ్రామానికి చెందిన వారు. ఓ గిరిజనుడి నుంచి మరో గిరిజనుడు లంచం తీసుకోవడంపై గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ లోకనాథాన్ని అరెస్ట్ చేసి, రిమాండ్ తరలించారు.

'ఆర్థిక స్వావలంబన దిశగా సహకార సంఘాలు'

శ్రీకాకుళం అర్బన్: సహకార సంఘాలను ఆర్థిక స్వావలంబన దిశగా తీసుకువెళ్లేలా చర్యలు చేపట్టాలని ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. శ్రీకాకుళంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ కార్యాలయంలో గురువారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాస్ మా ట్లాడుతూ నూతన కేంద్రీయ సహకార విధానాన్ని రూపొందించేందుకు కేంద్ర మాజీ మంత్రి సురేష్ ప్రభు ఆధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నూతన వ్యవస్థను సహకార రంగంలోనే దేశీయ స్థాయిలోనే పరిరక్షించాలనే ఆలోచనతో రకరకాల కొత్త పథకాలతో కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల ఆలోచనలు చేసి ఒక డేటా బేస్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో 2,64,000 సహకార సంఘాలు నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. నూతన విధానానికి మన రాష్ట్రం అంగీకారం తెలిపినట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రపంచంలోనే తొలిసారిగా నేషనల్ కో ఆపరేటివ్ యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు.

'40 రోజుల్లో నిర్మాణాలు పూర్తి చేయాలి'



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వర్ధన్

జయపురం: పట్టణంలోని పూల్‌బెడలో నిర్మితమవుతున్న జిల్లా కేంద్ర ఆస్పత్రి నూతన భవన సముదాయాన్ని 40 రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ వి.కీర్తి వర్ధన్ ఆదేశించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న భవనాన్ని బుధవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. 2021లో శంకుస్థాపన చేసిన ఈ భవనాలను 2024 ఆగస్టు 25లోగా పూర్తి చేయాలన్నది లక్ష్యం. ఆయనతో పాటు ప్రభుత్వ ఇంజినీర్ బిశ్వరంజన్ షొడంగి, జిల్లా మెడికల్ అధికారి డాక్టర్ దిలీప్ బిశ్వాల్, డీపీఎం శుభకాంత గంతాయిత్, ఆస్పత్రి మేనేజర్ రూపసి మధుస్మిత నాయిక్ తదితరులు ఉన్నారు.

విజిలెన్స్ విచారణ జరిపించాలి




మాట్లాడుతున్న గోవింద పాత్రో

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని 13 ప్రాజెక్టుల్లో చేపడుతున్న నాసిరకం పనులపై విజిలెన్స్ విచారణ జరిపించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గోవింద పాత్రో మాట్లాడుతూ.. 13 ప్రాజెక్టుల్లో రూ.84,23,000లకు కేవలం రూ.70,78,714ల నిధులు మాత్రమే ఖర్చు చేశారని ఆరోపించారు. మిగిలిన నిధులు ఏం చేశారో తెలియజేయడంతో పాటు వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శరత్ బురద, జి.శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మకు సారీ చెప్పి..

- బీటెక్ విద్యార్థి ఆత్మహత్య
- వైజాగ్ గీతంలో చదువుతున్న జశ్వంత్
- స్థానిక ప్రశాంత నగర్‌లో విషాదం



ఇంజీరింగ్ విద్యార్థి జశ్వంత్ (ఫైల్)

నరసన్నపేట: రోజూ సాయంత్రం అమ్మతో ఇష్టంగా మాట్లాడే బిడ్డ ఆ రోజు సాయంత్రం ఫోన్ చేయలేదు. ఏ బాధ వచ్చినా తల్లితో పంచుకునే ఆ కొడుకు ఆ సాయంత్రం వేళ మాత్రం 'సారీ' అన్న సందేశమే పంపించాడు. అమ్మను క్షమించమని కోరి ఆ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చి అనంతలోకాలకు వెళ్లిపోయాడు. నరసన్న పేట ప్రశాంత నగర్‌కు చెందిన కాళిన జశ్వంత్(20) విశాఖలో ఆత్మహత్యకు పాల్పడడంతో స్థానికంగా విషాదం అలముకుంది. కుటుంబ సభ్యులు అందించిన సమాచారం మేరకు.. స్థానిక ప్రశాంత నగర్‌కు చెందిన కాళిన రమేష్, సంధ్యల కుమారుడు జశ్వంత్. విశాఖ గీతంలో ఇంజినీరింగ్ ఈసీఈ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఇంటికి వచ్చి ఆదివారం వరకూ ఇక్కడే అందరితో సరదాగా గడిపి సోమవారం కాలేజీకి వెళ్లాడు. బుధవారం ఉదయం ఫోన్ చేసి తల్లితో మాట్లాడాడు. సాయంత్రం కూడా రోజూ ఫోన్ చేసి మాట్లాడుతుంటాడు. కానీ బుధవారం సాయంత్రం మాత్రం ఫోన్ కాల్ బదులు అమ్మా.. సారీ అని మేసేజ్ వచ్చింది. తల్లి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దీంతో రూమ్‌మేట్‌కు ఫోన్ చేసి కొడుకు రూమ్ వద్దకు వెళ్లమని ఆమె కోరారు. అక్కడకు కొద్ది సమయానికే జశ్వంత్‌కు సీరియస్‌గా ఉంది అని కళాశాల యాజమాన్యం నుంచి సమాచారం రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన విశాఖ వెళ్లారు. అప్పటికే జశ్వంత్ మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు.

విద్యార్థి తండ్రి రమేష్ మాట్లాడుతూ మా అబ్బాయి అంత పిరికివాడు కాదని, మాకు అనేక సందర్భాల్లో ధైర్యం చెప్పే వాడని, ఆత్మహత్యకు పాల్పడే మనస్తత్వం కాదని అన్నారు. మృతిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గురువారం సాయంత్రం 5 గంటలకు విశాఖ నుంచి మృతదేహం రాగా అనంతరం దహన సంస్కారాలు నిర్వహించారు.

సైబర్ నేరాలపై జాగ్రత్త అవసరం



ఫేక్ ట్రేడింగ్ యాప్

శ్రీకాకుళం క్రైమ్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జీఆర్ రాధిక తెలిపారు. ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో ప్రజలను సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారని జాగ్రత్త వహించాలన్నారు. ఈ నేరగాళ్ల పద్ధతులపై జిల్లా ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి అనేక రకమైన సామాజిక మాధ్యమాలను వాడే యూజర్లను టార్గెట్ చేసుకుంటాని, స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని, నమ్మకం కోసం కొందరి పేర్లు, ఫోన్ నంబర్లు ఇచ్చి మాయమాటలు చెప్పే ప్రయత్నం చేస్తారని, అవతల లాభపడ్డామని చెప్పే వ్యక్తి నేరగాళ్లలో ఒకడిగా ఉంటాడని, అందుకే అలాంటి తప్పుడు ప్రకటనలు నమ్మవద్దన్నారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల కోసం వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. ట్రేడింగ్‌కు సంబంధించి తప్పుడు యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకొని పెట్టుబడులు పెట్టవద్దన్నారు. సైబర్ మోసానికి గురైతే సైబర్ హెల్ప్‌లైన్ నంబరు 1930కి కాల్ చేయాలని లేదని సైబర్ క్రైమ్ డాట్ జీవోవి డాట్ ఇన్ లో ఫిర్యాదు చేయవచ్చన్నారు.

క్లుప్తంగా

ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల తనిఖీ



గొట్లాం గాయత్రీ విద్యాసంస్థల్లో పర్యవేక్షిస్తున్న అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్

విజయనగరం క్రైమ్: జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా ఉండేందుకు నియమించిన సిబ్బంది పనితీరును అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ గురువారం పర్యవేక్షించారు. ఎటువంటి అవకతవకలు, కాపీయింగ్ జరగకుండా ఏర్పాటుచేసిన బందోబస్తును ఆమె పరిశీలించారు. ఈ మేరకు పట్టణంలోని గాయత్రి, సాయిగాయత్రి, గొట్లాంలోని గాయత్రి విద్యాసంస్థలు, గజపతినగరంలోని సాయి సిద్ధార్థ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను సందర్శించి, భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించి, బందోబస్తు విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, అధికారులకు పలు సూచనలు చేశారు.

700 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేసి డ్రమ్ములను స్వాధీనం చేసుకున్న సీఐ చంద్రశేఖర్

కొత్తవలస: మండలంలోని రామలింగాపురం గ్రామం శివారు ప్రాంతంలో రహస్యంగా నిర్వహిస్తున్న సారా తయారీ శిబిరాలపై సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సారా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 700 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. పోలీసుల అలికిడిని గమనించిన సారా తయారీ దారులు అక్కడ నుంచి పరారయారు. అనంతరం పోలీస్ సిబ్బంది బెల్లం ఊట నిల్వఉంచిన డ్రమ్ములను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా: ముగ్గురికి తీవ్ర గాయాలు





గాయపడిన కూలీలు, (ఇన్‌సెట్లో) కస్పాగదబవలస సమీపంలో బోల్తా పడిన ట్రాక్టర్

కురుపాం: మండల కేంద్రం సమీపంలో ఉన్న కస్పాగదబ వలస మలుపు వద్ద గురువారం ఇటుకల లోడు ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరఘట్టం మండలం నడిమికెల్ల గ్రామం నుంచి ఇటుక లోడుతో ట్రాక్టర్ కురుపాం వస్తుండగా మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడిపోయింది. దీంతో ట్రాక్టర్‌పై ఉన్న నడిమికెల్ల గ్రామానికి చెందిన జి.గోపయ్య, కె.పోసయ్య, ఎం.సింహాచలం తీవ్ర గాయాల పాలయ్యారు. వెంటనే వారిని 108 వాహనంలో కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లగా ప్రాథమిక చికిత్స అనంతరంమెరుగైన వైద్య సేవల కోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కురుపాం ఎస్సై షణ్ముఖరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్తవలసలో కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తదితరులు

కొత్తవలస: తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన సోషల్ మీడియా ట్రోలింగ్‌లతో మనస్తాపం చెందిన గీతాంజలి ఆత్మహత్యకు పాలప్పడిందని, ఇందుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గీతాంజలి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్‌పర్సన్ శోభాస్వాతిరాణితో కలిసి మండల కేంద్రం కొత్తవలసలోని మూడు రోడ్ల జంక్షన్‌లో కొవ్వొత్తుల ర్యాలీని గురువారం రాత్రి ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికార దాహం కోసం ఎంతటి నీచమైన పనులకైనా తెలుగుదేశం, జనసేన పార్టీలు తెగబడుతున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మచ్చ ఎర్రయ్యారామస్వామి, స్టేట్ డైరెక్టర్ దమ్ము రమణ, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుకు భరోసా

- పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- యజమానులకు ఆరోగ్య కార్డుల అందజేత



రాజయ్యపేటలో పాడిరైతులకు పశు ఆరోగ్య కార్డులపై అవగాహన కల్పిస్తున్న పశువైద్య సహాయకురాలు

రాజాం సిటీ: పాడి పరిశ్రమనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అండగా నిలుస్తున్నారు. ప్రతి పశువుకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పశువుల యజమానులకు భరోసా కల్పిస్తూ ప్రభుత్వం పశువుల ఆరోగ్య కార్డులు అందజేసింది. ఆవులు, గేదెలు, ఎద్దులు, గొర్రెలు, మేకలు రోగాల బారిన పడితే ఈ కార్డుల ద్వారా వాటి స్థితిగతులను తెలుసుకుని మెరుగైన చికిత్స అందించేలా రూపకల్పన చేశారు. ఈ కార్డులు పొందిన రైతులంతా తమకు ఎంతో ఉపయోగంగా ఉందంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఆవులు 3.77 లక్షలు, గేదెలు 97వేలు, గొర్రెలు, మేకలు, ఇతర జీవాలు 6.35 లక్షల వరకు ఉన్నాయి. ఇప్పటికే గ్రామాల్లోని సచివాలయం పరిధిలో పశువైద్య అసిస్టెంట్ల నియామకం చేపట్టారు. అలాగే నియోజకవర్గానికి రెండు చొప్పున పశువైద్య అంబులెన్స్‌లు సమకూర్చారు. దీనికి 1962 టోల్ ఫ్రీ నంబర్‌ను కేటాయించి అత్యవసర సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఏదైనా కారణంతో పశువు మృతిచెందితే రైతులు నష్టపోకుండా ఉండేందు కు పశువులకు బీమా సౌకర్యం కల్పించి పాడి రైతులను ఆదుకుంటున్నారు.

ఉపయోగాలెన్నో..

పశువులకు ఇస్తున్న హెల్త్ కార్డులతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. ఆరు ఆవులు, గేదెలకు ఒకటి చొప్పున, 20 గొర్రెలు, మేకలకు ఒకటి చొప్పు న ఆయా యజమానులకు హెల్త్ కార్డులు అందజేశారు. ఈ కార్డుల్లో రైతుపేరు, ఊరు, వైద్యసేవలు అందించిన చికిత్సల వివరాలు పొందుపరచనున్నారు. ఆరోగ్య సంరక్షణ చర్యలు, కృత్రిమ గర్భధారణ తదితర వివరాలు నమోదు చేస్తారు. దీని వల్ల భవిష్యత్తులో ఎప్పుడైనా పశువులు రోగాల బారిన పడితే వాటి ఆరోగ్య స్థితి తెలుసుకోవడం ద్వారా సులభంగా వైద్యం అందించేందుకు వైద్యులకు వీలు కలుగుతుంది. హెల్త్ కార్డులో పశువులు, జీవాలకు వచ్చే రోగాలు–నివారణ చర్యలు పొందుపర్చారు. ఇదిలా ఉండగా రైతులే సొంతంగా తమ పశువులకు మందులు అందించి ఉపశమనం పొందవచ్చు. ఈ కార్డుల ఆధారంగా పశువుల సంఖ్య, వాటికి కావాల్సిన మందులు వంటి విషయాలు తెలుసుకోవచ్చు. ఈ కార్డుల జారీతో అటు రైతులు, ఇటు పశుసంవర్ధకశాఖ అధికారులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో 1,80,400 కార్డులు లక్ష్యం కాగా ఇంతవరకు 96 శాతం మేర పంపిణీ పూర్తి చేశారు.

ఆరోగ్య కార్డు గుర్తింపు ఇలా..

అన్ని మూగజీవాల వివరాలు ఆన్‌లైన్ చేసి హోలోగ్రామ్‌తో కూడిన పది అంకెల సంఖ్యలో పొందుపరిచి గుర్తింపు ఇస్తారు. ఈ హోలోగ్రామ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఆ నంబర్‌పై ఎన్ని జీవాలు ఉన్నాయి, రైతు ఎవరు, పశువులకు ఎటువంటి వ్యాధులు ఉన్నాయి వంటి వివరాలు తెలియనున్నాయి. ఆరు పెద్ద పశువులకు ఒక ఆరోగ్య గుర్తింపు కార్డును, 20 చిన్న జీవాలకు ఒక కార్డు చొప్పున కేటాయించారు. ఈ కార్డుల్లో ఆయా సమాచారం పూర్తిస్థాయిలో పొందుపరిచారు.



ఆరోగ్య కార్డులు పొందిన రైతులతో వైద్యాధికారులు

రైతులకు ఎంతో మేలు..

పశు ఆరోగ్య కార్డులతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. ఒక రైతుకు రెండు పశువులు ఉన్నా హెల్త్ కార్డు అందజేస్తున్నాం. ఈ కార్డులో పశువులకు సంబంధించి అన్ని వివరాలు ఉన్నాయి. పాడి రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి.

బి.జయప్రకాశ్, పశుసంవర్ధకశాఖ ఎ.డి, రాజాం

96 శాతం పంపిణీ పూర్తి

జిల్లాలో పశు ఆరోగ్య కార్డుల పంపిణీ 96 శాతం పూర్తి చేశాం. పశు ఆరోగ్య కార్డు ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి. సంబంధిత ఆర్‌బీకేల్లో పశువైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. ఈ కార్డుల ద్వారా పశువులకు అందించే వైద్యసేవల గురించి తెలుసుకోవచ్చు. పశుగణన, వ్యాధుల నిర్ధారణ, ప్రభుత్వం నుంచి అందించే ఉచిత మందులు, టీకాల వివరాలతో పాటు పశు బీమా వంటివి తెలుసుకునేందుకు ఈ కార్డులు ఉపయోగపడతాయి.

ఎ.విశ్వేశ్వరరావు, జేడీ, పశుసంవర్ధకశాఖ, విజయనగరం

ఎల్లారమ్మ జాతరకు సర్వం సిద్ధం



ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

- రేపటి నుంచి మూడురోజులు నిర్వహణ
- గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు



యల్లారమ్మ ఆలయం



యల్లారమ్మ అమ్మవారు

జామి: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధిగాంచిన, భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి జామి ఎల్లారమ్మ జాతర శనివారం నుంచి మూడురోజుల పాటు జరగనుంది. ఈ సందర్భంగా 16న తొలేళ్లు, 17న జాతర, 18న చిన్నతీర్థం జరగనున్నాయి. ఈ జాతరకు ఎండోమెంట్ అధికారులు, పంచాయతీ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు ఇతర అన్నిశాఖల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జాతరకు జిల్లా నుంచే కాక రాష్ట్రం నలుమూలలు, ఒడిశా, చెన్నై, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి, భక్తులు హాజరవుతారు, జాతరకు సుమారు రెండున్నర లక్షలమంది భక్తులు వస్తారని అంచనా. దేవదాయ, పంచాయతీ, తదితర శాఖల అధికార యంత్రాంగం జాతరకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. భక్తులు గురువారం అమ్మవారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. జాతరలో ఏర్పాట్లపై ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మండలంలోని అన్నిశాఖల అధికారులతో ఇప్పటికే సమీక్షసమావేశం నిర్వహించారు.

ప్రత్యేక ఏర్పాట్లు: పంచాయతీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు 24గంటలూ తాగు నీరు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ట్యాంకర్లతో తాగు నీటిని వీధుల్లో సరఫరా చేస్తారు. గ్రామంలో చెత్త,చెదారం ఎప్పటికప్పుడు తొలగించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇరిగేషన్ అధికారులు తాటిపూడి జలాశయం నుంచి గోస్తని నదిలోకి నీటిని విడుదల చేయనున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు ఉచిత మజ్జిగ సరఫరా, ఉచిత తాగునీరు, పులిహోర పొట్లాల పంపిణీ చేయనున్నారు. జామి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జాతరలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

గట్టిపోలీస్ బందోబస్తు

తొలేళ్ల రోజు అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం సందర్భంగా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్‌సమస్య, ఇతర ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సుమారు 200 మంది పోలీస్ సిబ్బందిని ఏర్పాటుచేశారు. సీఐ ఉపేంద్ర ఆధ్వర్యంలో ఎస్సై వీరబాబు పర్యవేక్షణలో సిబ్బంది బందోబస్తు చేపట్టనున్నారు. ఎస్.కోట, సింహాచలం డిపోల నుంచి ప్రతి అరగంటకు ఉండేవిధంగా ఆర్టీసీ బస్సులు నడపనున్నారు.

సెపక్ తక్రాలో కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి

గంట్యాడ: సెపక్ తక్రా (ఫుట్‌బాల్ తరహా) క్రీడలో కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గత నెల 24, 25 తేదీల్లో నెల్లూరు జిల్లాలో అంతర జిల్లా జూనియర్, సబ్‌జూనియర్ విభాగాల్లో జరిగిన సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. ఈ సందర్భంగా సబ్ జూనియర్ విభాగంలో ప్రతిభ కనబరిచిన సబ్‌జూనియర్ విభాగంలో కె.అశ్విని(8వతరగతి), జె.రీతు సాయి(8వతరగతి), జి.హేమ శ్రీ (8 వతరగతి), జి. పవిత్ర (8వతరగతి), ఆర్.ఐశ్వర్య (7వతరగతి) జూనియర్ విభాగంలో ఎల్.విజయ (9వతరగతి), టి. తేజస్విని (9 వతరగతి), పి. దివ్యశ్రీ (9వతరగతి)లను ప్రిన్సిపాల్ అల్లు జ్యోతి, పీఈటీ భవాని గురువారం పాఠశాలలో అభినందించారు.

ఐవీఎఫ్ సెంటర్ నిర్వహణకు అనుమతి తప్పనిసరి

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు



లండన్ ఐవీఎఫ్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: ఐవీఎఫ్ సెంటర్ నిర్వహించేవారు వైద్య ఆరోగ్యశాఖ వద్ద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు విజయనగరంలోని లండన్ ఐవీఎఫ్ సెంటర్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఐవీఎఫ్ సెంటర్‌ను నిర్వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గైనకాలజిస్టు డాక్టర్ ఆర్.సుజాత, సర్వజన ఆస్పత్రి రేడియాలజీ విభాగం హెచ్ఓడీ డాక్టర్ ఎల్‌వీవీ ప్రసాద్, పెథాలజిస్టు డాక్టర్ భానుమిత్ర దాస్, నేచర్ సంస్థ ప్రతినిధి జేఎస్‌వీ కృష్ణారావు, డెమో చిన్నతల్లి, ఎం.చాముండేశ్వరి దేవి తదితరులు పాల్గొన్నారు.

చెవిలో పువ్వు..చేతిలో గ్లాస్‌తో ఎలా?


- ఎంపీ టికెట్ టీడీపీకే కేటాయించాలని కార్యకర్తల నిరసన
- పూసపాటిరేగ మండల టీడీపీ అంతర్గత సమావేశంలో అసంతృప్తి



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్రకార్యదర్శి పతివాడ తమ్మునాయుడు

పూసపాటిరేగ: పూసపాటిరేగ మండల టీడీపీ అంతర్గత సమావేశంలో ఆ పార్టీ కార్యకర్తలు నిరసన తెలియజేశారు. మండలంలోని చల్లవానితోటలో మాజీ ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామి నాయుడు స్వగృహంలో మండల టీడీపీ కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో పలువురు టీడీపీ కార్యకర్తలు చెవిలో పువ్వు..చేతిలో గ్లాస్‌తో ఎలక్షన్ ఉలా చేయాలంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. 95 శాతం టీడీపీ బలం ఉన్న నెల్లిమర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్‌ను ఇప్పటికే జనసేనకు కేటాయించారు. విజయనగరం ఎంపీ టికెట్ బీజేపీకి కేటాయిస్తామని సంకేతాలు ఇచ్చారు. సైకిల్ గుర్తు అసలు కనబడనప్పుడు ప్రజల వద్దకు వెళ్లి ఏమని చెబుతాం, ఓట్లు ఎలా అడుగుతామని టీడీపీ రాష్ట్రకార్యదర్శి పతివాడ తమ్మునాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడులు సభ ద్వారా అధిష్టానానికి తెలియజేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడి పరిస్థితి అంతంతమాత్రంగా ఉండడంతో ఆయన ఏం చేయగలరని సమావేశంలో పలువురు పెదవి విరిచారు. బీజేపీకి విజయనగరం ఎంపీ టికెట్ ఇస్తే ఓటమి ఖాయమని బహిరంగంగానే సభలో పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. పార్టీ జాతీయ అధ్యకుడు చంద్రబాబు నాయుడిని కలిసి విజయనగరం ఎంపీ టికెట్ టీడీపీకి ఇవ్వాలని డిమాండ్ చేద్దామని సమావేశంలో నిర్ణయించారు. మాజీ ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామి నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు ఎంవీజీ శంకర్రావు, విక్రం జగన్నాథం, పసుపులేటి గోపి, పిన్నింటి శ్రీనివాసరావు, లంకలపల్లి శ్రీనివాసరావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ విద్యార్థిని ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థిని రూప

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి యాదవ కాలనీకి చెందిన ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థిని కడుపునొప్పి బాధ తాళ లేక ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గురువారం వేకువ జామున జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రాజాన రూప(20) పదవతరగతి పూర్తయిన తర్వాత కొద్ది సంవత్సరాలు ఇంటి వద్దనే ఉంది. గత ఏడాది గజపతినగరం లోని సాయిసిద్ధార్థ కాలేజీలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్స రంలో చేరింది. ఆమె తండ్రి గత ఏడాది మరణించాడు. తల్లి ఉపాధి నిమిత్తం కూలి పనుల కోసం వేరే ఊరిలో ఉంటుండగా అమ్మమ్మ మురపాక సూరమ్మ సంరక్షణలో ఉంటూ చదువుకుంటోంది. అయితే కొద్ది నెలలుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్న ఆమె గురువారం వేకువ జామున ఇంట్లోనే ఉరివేసుకుంది. మృతురాలి అమ్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయనగరం లోని సర్వజన ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

ఏపీవీవీపీ ఉద్యోగులపై విచారణ

విజయనగరం ఫోర్ట్: జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయాధికారి (డీసీహెచ్ఎస్) కార్యాలయంలో వైద్య విధాన్ పరిషత్ ఉద్యోగులపై శ్రీకాకుళం జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ వి.రాజ్యలక్ష్మి విచారణ చేపట్టారు. వెద్య విధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో పని చేయడానికి సంబంధించి 2021–22సంవత్సరంలో చేపట్టిన పలు నియామకాలు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారనే ఆరోపణలపై ఏపీవీవీపీ సిబ్బందిపై విచారణకు ఆ శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గురువారం ఆమె విచారణ చేపట్టారు. నియామకాలకు సంబంధించి రికార్డులను తనిఖీ చేశారు.

అంకిత భావంతో పని చేయాలి : డీఎంహెచ్‌ఓ

విజయనగరం ఫోర్ట్: వృత్తి పట్ల అంకిత భావంతో పని చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో 39 మంది కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగులకు రెగ్యులర్ చేస్తూ గురువారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పారామెడికల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్, వేసవి కార్యాచరణపై ప్రత్యేక దృష్టి

బొబ్బిలి: రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్, ఇతర వేసవి కార్యాచరణలపై ఈపీడీసీఎల్ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఈపీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్ సి.శ్రీనివాసమూర్తి అధికారులకు ఆదేశించారు. స్థానిక ఈఈ కార్యాలయంలో సిబ్బందితో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు. రూ.4 కోట్లతో నిర్మి స్తున్న పినపెంకి, రామభద్రపురంలలో అదన పు ట్రాన్స్‌ఫార్మర్ల నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చిందని ఎస్ఈ లక్ష్మణరావు డైరెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే గ్రామాల్లో కూడా 3ఫేజ్ విద్యుత్‌ను 24 గంటలు సరఫరా చేసే పనులు జరుగుతున్నాయన్నారు. లో ఓల్టేజి నివారించడమే లక్ష్యంగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. ఈఈ ఎ.అనంతరావు, ఏఈ సాంబశివరావు, ఏడీఏలు, పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర నాటక పోటీలకు ఆహ్వానం

రాజాం : పట్టణంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర సందర్భంగా ఉత్తరాంధ్ర స్థాయి పౌరాణిక నాటక పోటీలు నిర్వహిస్తున్నామని దేవదాయశాఖ ఈఓ బీవీ మాధవరావు తెలిపారు. స్థానికంగా గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయ 98వ వార్షికోత్సవంలో భాగంగా ఈ నెల 17న రాత్రి 8 గంటలకు ఎస్‌వీఆర్ పరిషత్ అధ్యక్షుడు సలాది తులసీదాస్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర స్థాయి ఏక పాత్రాభినయ పౌరాణిక పోటీలు ఉంటాయని, విజేతలకు నగదు బహుమతులు ఇస్తామని ప్రకటించారు. పోటీల్లో పాల్గొనదలచిన కళాకారులు ముందుగానే ఆలయ కమిటీని సంప్రదించాలని కోరారు. సమావేశంలో ఆలయ ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్, కమిటీ సభ్యులు సలాది తులసీదాస్ మాస్టారు, వెంపల లక్ష్మణరావు, ఆర్నేపల్లి వెంకటనాయుడు, మక్క అప్పలనాయుడు, పాగిరి సురేష్, పెంకి చైతన్యకుమార్, గ్రంధి గోపి, ఆలయ అర్చకులు వేమకోటి సూర్యనారాయణశర్మ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయస్థాయిలో ఏఆర్ పోలీసులకు పతకాలు

- అభినందించిన ఎస్పీ



క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధించిన ఏఆర్ పోలీసులను ఎస్పీ ఎం.దీపిక గురువారం తన చాంబర్‌లో ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల థాయి లాండ్ దేశంలో జరిగిన 28వ థాయిలాండ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న ఏఆర్ కానిస్టేబుల్ పి.సన్యాసినాయుడు పోల్‌వాల్ట్‌లో బంగారుపతకం, ఎం.మహేశ్వరరావు 5 కిలోమీటర్ల బ్రిస్క్ వాకింగ్‌లో సిల్వర్ పతకం సాధించారన్నారు. అదేవిధంగా మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోలీస్ యోగా మీట్‌లో పాల్గొన్న ఏఆర్ కానిస్టేబుల్ ఎం.దుర్గాప్రసాద్ బంగారు పతకం సాధించారు. అలాగే ఒక గంట 30 నిమిషాల్లో 216 సెట్స్ సూర్యనమస్కార యోగాసనాలు వేసి, యోగాసనాల్లో వరల్డ్ రికార్డు నెలకొల్పి మరో బంగారుపతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా విజేతలకు ఎస్పీ అభినందనలు తెలిపి గుడ్ సర్వీస్ ఎంట్రీలను ప్రకటించారు. ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు టి.శ్రీనివాసరావు, ఎన్.గోపాలనాయుడు తదితరులు విజేతలను అభినందించారు.

ముగిసిన 'ప్రతిష్ట 2కే24' సదస్సు



విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ

విజయనగరం అర్బన్: ఇంజినీరింగ్‌లో ఏ కోర్సులోనైనా కోర్ సబ్జెక్టుతోపాటు మెరుగైన నైపుణ్యం కలిగి ఉంటే ఉద్యోగావకాశాలు లభిస్తాయని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ అన్నారు. ఈ మేరకు ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక యూనివర్సిటీలో 'ప్రతిష్ట 2కే24' పేరుతో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియం గురువారం ముగిసింది. ముగింపు సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఇలాంటి సింపోజియంలకు విద్యార్థులు హాజరైతే వారి మేనేజ్‌మెంట్ స్కిల్స్ మెరుగవుతాయన్నారు. కోర్ సబ్జెక్టుపై పట్టుతోపాటు కంప్యూటర్ నాలెడ్జ్‌ను పెంపొందించుకోవాలని సూచించారు. నైపుణ్యం మెరుగుపరుచుకుంటే మంచి అవకాశాలు వస్తాయని చెప్పారు. అనంతరం ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వివిధ రకాల పోటీల విజేతలకు సర్టిఫికెట్స్, జ్ఞాపికలు అందజేశారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీనివాసప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, టెక్నికల్ సింపోజియం ఫ్యాకల్టీ కో–ఆర్డినేటర్లుగా ఆర్.బాలమురళీకృష్ణ, టీఎస్‌డీఫణీంద్రనాథ్, స్టూడెంట్ కో ఆర్డినేటర్లుగా ఎస్.లతీఫ్‌కుమార్, వై.తిరుమలదేవి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జియో కెమిస్ట్రీ రంగంలో ఉద్యోగ అవకాశాలు మెండు

- గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి



సదస్సులో పాల్గొన్న విద్యార్థులతో వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి

విజయనగరం అర్బన్:

భూవిజ్ఞాన, రసాయనిక శాస్త్రాలపై పరిశోధన చేసిన వారికి ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి అన్నారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో 'వికసిత భారత్ -2047 ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ జియో కెమిస్ట్రీ అండ్ జియో కెమికల్ ఎనాలిసిస్ అనే అంశాలపై' గురువారం నిర్వహించిన ఒక్క రోజు సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం 2020 ద్వారా మల్టీడిసిప్లినరీ విద్యా ప్రాధాన్యత సంతరించుకుందని ఈ అవకాశాన్ని యువత అందిపుచ్చుకోవాలని అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ ఎన్‌జీఆర్ఐ విశ్రాంత ఎమిరిటస్ సైంటిస్ట్ డాక్టర్ బలరాం మాట్లాడుతూ భూవిజ్ఞాన శాస్త్రంలో ముఖ్య భాగమైన జియో కెమికల్ సైన్స్ విద్యార్థులకు, పరిశోధకులకు, పర్యావరణ ప్రేమికులకు భూరసాయనిక శాస్త్ర అధ్యాపకులు ఎదుర్కొనే సమస్యలను సమాధానం చెబుతుందన్నారు. కార్యక్రమంలో జియాలజీ విభాగ సహాయ అధ్యాపకుడు ప్రతిష్టాత్మక స్ప్రింగర్ పబ్లికేషన్ ద్వారా సంకలనం చేసి ప్రచురించిన 'ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఇన్ వాటర్ సప్లై కన్సర్వేషన్ అండ్ మేనేజ్‌మెంట్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ సంకలన కర్త డాక్టర్ ప్రసాద్‌ను అభినందించారు. జియాలజీ విభాగాధిపతి డాక్టర్ కలిదిండి సురేష్‌బాబు, ఉమెన్స్ సెల్ చైర్‌పర్సన్ డాక్టర్ పరికిపండ్ల శ్రీదేవి, డాక్టర్ లతాకల్యం పూడి, డీన్ ప్రొఫెసర్ శరత్ చంద్రబాబు, ఏట డాక్టర్ ఎన్‌వీ సూర్యనారాయణ, డాక్టర్ గంగునాయుడు, డాక్టర్ బాలుమూరి వెంకటేశ్వర్లు, డాక్టర్ పడాల కిషోర్, డాక్టర్ నారాయణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.